క్లుప్తంగా

రేపటి నుంచి ఆక్వా జోన్ల గ్రామ సభలు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో ఆక్వా జోన్ల ఏర్పాటుపై సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కె.ప్రకాశరావు తెలిపారు. ఆయన పెదపూడిలో శనివారం మాట్లాడుతూ 7న ఏపీత్రయం, దోమాడ, జి.మామిడాడ, కాండ్రేగుల గ్రామాల్లో, 8న కరకుదురు, రాజుపాలెం, కైకవోలు, పెదపూడిలో, 9న పుట్టకొండ, వేండ్ర, పెద్దాడ, పైన గ్రామాల్లో, 11న శహపురం, సంపర, గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు.

క్యాన్సర్ కేసులపై అధికారుల నిర్లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: అనపర్తి నియోజకవర్గంలోని బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల విషయంలో ప్రభుత్వ ఆరోగ్యశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఎందుకు వస్తున్నాయో ఆరోగ్యశాఖాధికారులు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందనే అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నారు.

వైఫల్యాలతో కుంగిపోవద్దు

రాజానగరం: జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలతో కుంగిపోకుండా, వాటినే అవకాశంగా తీసుకుని ప్రయత్నాన్ని కొనసాగిస్తే విజయాలను సొంతం చేసుకోవచ్చని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రొ వీసీ డాక్టర్ కేవీబీ రాజు అన్నారు. క్యాంపస్‌లోని వివిధ కళాశాలల అధ్యాపకులకు 'సక్సెస్ మంత్ర' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణను అభివృద్ధి చేసుకుంటూ ఆత్మస్థైర్యంతో పని చేసి, విజయపథంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ టీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా బాబూ జయంత్యుత్సవం



నల్గొండలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ చేసిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



దుప్పలపూడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

సీతానగరం: దేశంలోని అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బాబూ జయంతి సందర్భంగా శనివారం నల్గొండలో ఆయన విగ్రహాన్ని జక్కంపూడి రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలు తీసుకురావడంతో పాటు పరిపాలనా దక్షతలో తన మార్కును చూపించి, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, చింతల జనార్దన గంగాధర్, ఉప సర్పంచ్ పి.మహేష్, పసలపూడి శ్రీనుబాబు, గుంట కృష్ణ ప్రసాద్, పూజల డాక్టర్, బొంద్ర నాగరాజు పాల్గొన్నారు.

- కూనవరంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డాక్టర్ బాబు పాల్గొని నివాళులర్పించారు. ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, సుంకర నరసింహం పాల్గొన్నారు.
- ఇనుగంటివారిపేటలో బాబూజీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూలమాల వేశారు. సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్‌బాబు, జగ్జీవన్ రామ్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.
- సీతానగరంలో మద్దాల కొండలరావు ఆధ్వర్యంలో, మునికూడలిలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేశారు.

దేశం గర్వించే నాయకుడు

పెదపూడి: దేశం గర్వించదగిన మహా నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం దుప్పలపూడిలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లభశెట్టి రామ సతీష్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కులవివక్షత నిర్మూలన కోసం విద్యార్థి దశ నుంచి పోరాటం చేసిన మహోన్నతుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, దళితులు కోట సత్తియ్య, యు.బండరాజు, కోట ఏసు, కె.శామ్యూల్, ఉండ్రాజపు వెంకట్రావు, పండు, కాకాడ దొర్లమ్మ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



బుచ్చెంపేటలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

వాడవాడలా..

కోరుకొండ: మండలంలోని కోరుకొండ, బూరుగుపూడి, బుచ్చెంపేట, దోసకాయలపల్లి, కణుపూరు, గాడాల, మధురపూడి గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బూరుగుపూడిలో ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల్లో జగ్జీవన్‌రామ్‌చిత్రపటాలతో ఊరేగింపు జరిగింది. బుచ్చెంపేటలో జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఐక్యవేదిక కన్వీనర్ మద్దాల చంటిబాబు, నాయకులు ఏడిద ప్రసన్నకుమార్, జొన్నకూటి నాని, తాతపూడి చక్రవర్తి, కత్తి మోసే తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త

పెదపూడి: తన పాలనా దక్షతతో దేశానికి విశేష సేవలందించిన గొప్పనేత బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కొవ్వూరి శ్రీనివాసారెడ్డి, నూతిక బాబురావు, సత్తి దేవానందరెడ్డి పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి

పెదపూడి: దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన గొప్ప నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పుట్టా గంగాధర్ చౌదరి అన్నారు. పెదపూడిలో జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో జయంత్యుత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, గ్రామ పెద్దలు యార్లగడ్డ అమ్మన్న చౌదరి, నల్లమిల్లి గంగిరెడ్డి, స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిర్రా ప్రసాద్ హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ వేడుకలు జరిగాయి.

బిక్కవోలు మండలంలో...

బిక్కవోలు: మండల పరిషత్ కార్యాలయంలో బాబూజీ చిత్రపటానికి మండల ప్రత్యేక అధికారి విజయకుమారి, ఎంపీడీవో వి.శ్రీనివాస్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు.

రంగంపేట మండలంలో..

రంగంపేట: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ కుందేటి వెంకట రమణ అన్నారు. వడిశలేరు గ్రామంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'నన్నయ' వర్సిటీలో..

రాజానగరం: విద్యతోనే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని బాబూ జగ్జీవన్‌రామ్ నమ్మారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీలోని సెమినార్ హాలులో ఆయన చిత్రపటానికి శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బెనారస్ యూనివర్సిటీలో ఉన్నవిద్యనభ్యసించిన ఆయన స్వాతంత్ర్యానంతరం 30 ఏళ్ల పాటు మంత్రిగా దేశానికి విశిష్ట సేవలందించారన్నారు. అలాగే మండలంలోని సూర్యారావుపేటలో కాంగ్రెస్, లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో బీజేపీల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

- దివాన్ చెరువులో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతిలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

నిజం మాట్లాడే నాకు స్క్రిప్ట్ అవసరం లేదు

- అబద్ధాలు చెప్పే మీకే కావాలి
- ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం



పెదపూడి: పేకాట, క్రికెట్ బెట్టింగ్, గంజాయి వ్యాపారం సెంట్రలైజేషన్ చేయడమే బీజేపీ సిద్ధాంతమా లేక అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విధానమా అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడారు. అబద్ధాలు చెప్పే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లాంటి వ్యక్తులకు ఎవరో రాసిన స్క్రిప్ట్ అవసరమేమో కానీ, నిజాన్ని నిర్భయంగా చెప్పే తనకు అవసరం లేదన్నారు. పెదపూడి మండలంలో ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడే గంజాయి కేసులో నిందితుడిగా దొరికాడని, ఇంత పెద్ద ఎత్తున గంజాయి వ్యాపారం నియోజకవర్గంలో సాగుతూ ఉంటే దీనిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అంటే తన స్క్రిప్ట్ రైటర్‌కు ఖాళీ లేక ఎమ్మెల్యే స్పందించలేదా, లేక వారి నుంచి మామూళ్లు వసూలు చేసి గంజాయి వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానం కలుగుతుందని ఆరోపించారు. గతంలో ఎవరైనా చిన్ని సారా కేసులలో, పేకాటలో దొరికితే నాడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గొంతు చించుకునే వారని, మరి ఈ రోజు ఆయన అనుచరుడే గంజాయితో పట్టుబడితే ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సొంత ఊరు రామవరం కేంద్రంగా పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లను సెంట్రలైజేషన్ చేశారంటూ, వీటి నుంచి రోజుకు రూ.రెండు లక్షలకు పైగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి ముడుపులు ముడుతున్నాయంటూ ఆరోపించారు. ఈ వ్యవహారాల కోసం రామవరంలో పక్కాగా భవనాలే నిర్మించారంటూ ఆరోపించారు.

భజన సమాజాల పటిష్టతకు కృషి

రంగంపేట: భజన సమాజాల పటిష్టతకు విశేష కృషి చేస్తున్నట్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల భజన కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పోతుల వీరన్న, మావిరెడ్డి నెహ్రూ తెలిపారు. ఆయన శనివారం రంగంపేటలో విలేకరులతో మాట్లాడారు. పెద్దాపురం మండలం కాండ్రకోటలో శుక్రవారం ఉమ్మడి గోదావరి జిల్లాల భజన కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా రాజానగరం మండలం పరిజెల్లిపేటకు చెందిన యడవిల్లి సూర్యచక్రం ఎన్నికయ్యారన్నారు. ఆయన ఆధ్వర్యంలో కళాకారుల సంక్షేమంతో పాటు గ్రామాల్లోని భజన సమాజాల అభివృద్ధికి పాటు పడతామన్నారు. ప్రస్తుతం మహిళలు భజన సమాజాల్లో చురుగ్గా పాల్గొని తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారన్నారు.

బాధిత కుటుంబాలకు రాజా పరామర్శ



శ్రీరామనగరంలో బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: నియోజకవర్గంలో పలు బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు. సీతానగరం మండలం కూనవరం, రఘుదేవపురం, రాపాక, నాగంపల్లి, కోరుకొండ మండలం గాదరాడ గ్రామాల్లో ఆయన బాధితులను ఓదార్చారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, చల్లమళ్ల సుజీరాజు, కొండ్రపు ముత్యాలు, ద్వారంపూడి రామకృష్ణ, వలవల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో పలువురికి సేవలు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల శిక్షణ సందర్భంగా శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే రెండో రోజు కూడా రక్తదాన శిబిరం జరిపారు. కాలేజీ అసోసియేట్ డీన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో సామాజిక సేవా కార్యక్రమల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ సీహెచ్ సునీత, డాక్టర్లు హెచ్.శ్రీనివాస్, డాక్టర్ బి.సంతోష్, వర్ధమాన్, సత్యనారాయణ, చిన్ని పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి చురుగ్గా పనులు



భవనాలను తొలగిస్తున్న పొక్లెయిన్

రాజానగరం: వివిధ రకాల పండ్ల విక్రయాలకు కేంద్రంగా విరాజిల్లుతున్న దివాన్‌చెరువులో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. పండ్ల మార్కెట్ ఏరియా నుంచి గామన్ బ్రిడ్జికి వెళ్లే జీరో పాయింట్ వరకు దీన్ని నిర్మించనున్నారు. ఇందుకుగాను ప్రస్తుతం ఉన్న రహదారికి ఇరువైపు సబ్ వేలను ఏర్పాటు చేసి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే సేకరించిన స్థలంలో ఉన్న నిర్మాణాలను రెండు రోజులుగా పొక్లెయిన్లతో తొలగిస్తారు. దీనిలో భాగంగా రహదారిని ఆనుకుని ఉన్న దివాన్ చెరువు పంచాయతీ పాత భవనాన్ని కూడా తొలగిస్తున్నారు. ఒకప్పుడు గ్రామస్తులకు మంచినీటి చెరువుగా ఉపయోగపడిన ఊరచెరువును ఆనుకుని ఉన్న ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆరేళ్ల క్రితమే ఈ భవనం నుంచి పంచాయతీ రికార్డులను వేరొక చోటకు తరలించారు. ఆ తరువాత గ్రామ సచివాలయ వ్యవస్థ అమలులోకి రావడంతో ఈ భవనాన్ని పూర్తిగా వదిలేశారు.

మెగా వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటలో జగ్జీవన్ రామ్ యువత ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకర హాస్పిటల్ డాక్టర్ సుధీర్ 106 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం రాంపండు, ఏరియా మార్కెటింగ్ మేనేజర్ రాము, రుద్రమూర్తి పాల్గొన్నారు.

ఇంద్రధనస్సు కనువిందు



పెదపూడి: మండలంలో శనివారం మధ్యాహ్నం వరకు భానుడు మండిపోయాడు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా గాలులు వీచి చిరుజల్లులు పడి వాతావరణం చల్లబడింది. ఈ నేపథ్యంలో ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనస్సు అందరినీ అలరించింది.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సీతానగరం: చినకొండేపూడి పీఏసీఎస్‌లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఆర్డీవో కృష్ణనాయక్ శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఏవో సూర్యరమేష్ తదితరులు పాల్గొన్నారు.